క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన క్యూసీ సాయినాథ్‌తో కలిసి చిట్కుల్, చండూర్ గ్రామాల ప్రజలకు నీటి సరఫరా అయ్యే బోరుబావులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



నర్సాపూర్‌లో చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్: పట్టణ ప్రజలకు చెత్తను వేరు చేసే విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. బేసిల్ ఫౌండేషన్ ప్రతినిధులు ఉదయ్, విష్ణు, నరేందర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని ప్రజలను కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో పాటు ఎల్‌ఓసీ అందజేశారు. అస్వస్థతకు గురై చికిత్స చేయించుకున్న వారికి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌గౌడ్, రవిసాగర్, రమణ, మల్లేశం తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.5.75 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీని మంగళవారం భక్తుల సమక్షంలో లెక్కించారు. 5 నెలలకు సంబంధించి హుండీ లెక్కింపు చేపట్టాగా, రూ.5 లక్షల 75 వేల 876 వచ్చినట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, గ్రామస్తులు నారాయణరావు, నర్సింగరావు, హరిసింగ్‌నాయక్, రాజ రాజేశ్వరి సేవ సమితి సభ్యులు ఉన్నారు.

టీఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం టీఎన్‌జీఓ క్యాలెండర్, డైరీలను ఎంపీడీఓ ఆనంద్, ఏపీఓ శ్యామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా వైస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, స్పోర్ట్స్ సెక్రటరీ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు హన్మంత్, ఆనంద్‌లు పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న సీఈఓ ఎల్లయ్య

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయాన్ని సీఈఓ ఎల్లయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దామోదర్‌కు పలు చూచనలు చేశారు. కార్యాలయ సమయం పాటించడంతో పాటు పనులపై కార్యాలయానికి వచ్చేవారికి సరైన సమాధానం చెప్పడంతో పాటు న్యాయం చేయాలని సూచించారు.

ఆటో, బైక్ ఢీ: నలుగురికి గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కుకునూర్ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుకునూర్ వద్ద నర్సాపూర్ వైపు నుంచి ఆటోను కుకునూర్ వైపు నుంచి బైక్ ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో జంగరాయి తండాకు చెందిన కాట్రోతు కిషన్, రాజు, విశాల్, జగన్ తీవ్రగాయాలకు గురయ్యారు.

• గొర్రెలకు మేతగా వరి పంట



చండూర్ గ్రామ శివారులో వరిని మేస్తున్న గొర్రెలు

ఎండకాలం ప్రారంభంలోనే భూగర్భజలాలు అడుగంటిపోయ్యాయి. దీంతో వరి సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు ఆదిలోనే దెబ్బతిన్నారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామానికి చెందిన రైతు కుమ్మరి శేఖర్ గ్రామ శివారులో తనకున్న ఐదెకరాల భూమిలో వరిసాగు చేశాడు. ఆ సాగుకు గానూ సుమారు రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. నాటేసిన కొద్దిరోజులకే బోరుబావిలో నీళ్లు లేకపోవడంతో, పంట ఎండుముఖం పట్టింది. పంటను కాపాడుకునేందుకు శేఖర్ మూడు రోజుల వ్యవధిలో రూ. 2.5 లక్షలు ఖర్చు చేసి, రెండు బోరుబావులు వేయించినప్పటికీ ఫలితం శూన్యం. దాంతో రైతుకు అప్పులు మిగిలాయే తప్ప, నీటి చుక్క కూడా రాలేదు. విసుగు చెందిన రైతు సాగు చేస్తున్న ఐదెకరాల వరిని మంగళవారం గొర్రెలకు, పశువులకు మేతగా వదిలేశాడు.

– చిలప్‌చెడ్(నర్సాపూర్):

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. మండలంలోని చిట్కుల్ గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన, పలువురు విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏ నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎదురైతే, వ్యక్తిగత మరమ్మతులు చేసుకోకుండా, విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో మొండి బకాయిలు చెల్లించి, విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శంకర్, డీఈ చంద్‌పాషా, ఏడీఈ రమణరెడ్డి, చిలప్‌చెడ్ మండల ఇన్‌చార్జి ఏఈ సల్మాన్, లైన్‌మెన్‌లు కృష్ణ, రూప్‌సింగ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభించండి

హౌసింగ్ పీడీ మాణిక్యం చౌహాన్



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ మాణిక్యంచౌహాన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని హౌసింగ్ పీడీ మాణిక్యం చౌహాన్ అన్నారు. మంగళవారం ఆయన పైలట్ ప్రాజెక్ట్ ఎంపికైన చిలప్‌చెడ్‌లో పలువురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ గ్రామానికి 56 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం కోసం వేయించిన ముగ్గను ఫొటో తీసి, కార్యదర్శి సహాయంలో జియో ట్యాగింగ్‌తో పాటు, తీసిన ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఫొటోలో ఉన్న స్థలంలోనే ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఈ నెల 15 వరకు బేస్‌మెంట్ వరకు పనులు జరిగితే మొదటి బిల్లు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఇంటి పనులు జరుగుతున్న కొద్ది విడతల వారీగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలి



కాయిదంపల్లి గ్రామంలో పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని జిల్లా హర్టికల్చర్ ప్లాంటేషన్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. మంగళవారం అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి గ్రామంలో పండ్ల తోటల సాగును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదాయం పెంపొందించేందుకు రైతులకు పండ్ల తోటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో రైతుల ఆదాయ వనరులను పెంపొందించేందుకు, ఉపాధి హామీ నిధులతో జామ, మామిడి, నిమ్మ, కొబ్బరి, మునగ తదితర పండ్ల తోటలను సాగు చేయాలన్నారు. ఆసక్తి గల రైతులు మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎపీఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ సాయికుమార్, పంచాయతీ కార్యదర్శులు నవీన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు

కౌడిపల్లిలో పరీక్ష రాయనున్న 690 మంది విద్యార్థులు



కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్విజిలేటర్లకు సూచనలు చేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్

కౌడిపల్లి(నర్సాపూర్): సీసీ కెమెరాల నిఘాలో విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఈ నెల 5 నుంచి 20 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనుండగా అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కౌడిపల్లి కళాశాల, కౌడిపల్లి, తునికి ఎంజేపీ కళాశాలలు, కౌడిపల్లి ఎస్టీ గురుకుల కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 350, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 340 మంది మొత్తం 690 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 8సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షలకు సీఎస్‌గా మణికాంత్, డీఓగా ప్రభాకర్‌తో పాటు ఇన్విజిలేటర్లుగా నలుగురు లెక్చరర్లు, 12 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రం గదుల్లో విద్యార్థుల హాల్ టికెట్ నంబర్స్ వేసి సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రం వద్ద మంచినీరు, ప్రథమ చికిత్స కోసం ఏఎన్‌ఎం అందుబాటులో ఉంటారు. పరీక్ష కేంద్రం వద్ద బీఎన్‌ఎస్ 163(144) సెక్షన్ అమలులో ఉంటుంది.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కౌడిపల్లి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మణికాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని పరీక్ష సందర్భంగా విద్యార్థులు హాజరు, పరీక్ష పత్రం, జవాబు పత్రాలను పక్కగా సరిచూసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా అధికారులు పరీక్షిస్తారని ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఓ ప్రభాకర్, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 325 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 256 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. నార్సింగి మండల కేంద్రంలోని 159 మంది పరీక్షలకు హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ శంకర్‌గౌడ్ తెలిపారు. విద్యార్థులు 8:30 గంటలకు కళాశాలకు చేరుకోవాలని కోరారు. 9 గంటలకు పరీక్ష ప్రారంభం కానుందన్నారు.

ఒత్తిడిని జయించినప్పుడే విజయం



మాట్లాడుతున్న రమేశ్ బాబు

కొల్చారం(నర్సాపూర్): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ముందుకు సాగినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తామని మెదక్ రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం రంగంపేట ఉన్నత పాఠశాలలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మెదక్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ నిర్వహించారు. జిల్లా సత్యసాయి సేవ సమితి అధ్యక్షుడు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వాక్తగా రమేశ్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సహకారం అందించి, వారి అభ్యున్నతికి తోడ్పడుతున్నామన్నారు. అనంతరం రమేశ్ బాబు మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులు హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, సేవా సమితి మహిళా ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జి రుక్మిణి, ఆధ్యాత్మిక ఇన్‌చార్జి నాగరాణి, సమితి విద్యా విభాగ్ ఇన్‌చార్జి శైలజ, నారాయణ సేవా ఇన్‌చార్జి నగేష్, విశ్రాంత హెచ్‌ఎం రమేశ్ బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



పెద్దశంకరంపేటలో బీజేపీ నాయకుల సంబురాలు



రామాయంపేటలో ర్యాలీ బీజేపీ కార్యకర్తలు



నర్సాపూర్: సంబరాల్లో బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన మల్క కొమురయ్య గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ కార్యకర్తలు మంగళవారం రామాయంపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

పాపన్నపేట(మెదక్): కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య విజయంతో బీజేపీ కార్యకర్తలు పాపన్నపేటలో స్వీట్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాములు, పెద్ద కిష్టయ్య ఉన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. బస్టాండ్ చౌరస్తాలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దాసు, ఉపాధ్యక్షుడు బాలకిషన్, వెంకటేశం, శ్రీనివాస్, నవీన్, గణేశ్ పాల్గొన్నారు.

నర్సాపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిచినందుకు బీజేపీ నాయకులు మంగళవారం నర్సాపూర్‌లో సంబరాలు చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద మిఠాయిలు పంచి పెట్టి టపాకాయలు కాల్చి సంబరాలు చేశారు. సంబరాల్లో పార్టీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ తపస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన మల్క కొమురయ్య గెలుపొందాడు. దీంతో మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో స్వీట్లు తినిపించుకొని, టపాసులు కాల్చి కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, కృష్ణ తదితరులున్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులు, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులను హెచ్‌ఎంలు అభినందించారు.



కౌడిపల్లి(నర్సాపూర్): లింగంపల్లి పాఠశాలలో ..



శివ్వంపేట(నర్సాపూర్): చండీ పాఠశాలలో ..



అల్లాదుర్గం(మెదక్): కాయిదంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు



గౌతాపూర్ ఉన్నత పాఠశాలలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులు



రామాయంపేట(మెదక్): కోనాపూర్ జెడ్పీ పాఠశాలలో..



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్న ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు



పెద్దశంకరంపేట(మెదక్): వీరోజిపల్లిలో..

సంక్షిప్త వార్తలు

◆ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెద్దశంకరంపేట(మెదక్): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్కాపూర్‌కు చెందిన దాసరి సాయమ్మ ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌తో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సాయమ్మది నిరుపేద కుటుంబం కావడంతో ఆస్పత్రిలో చెల్లించిన రూ.3 లక్షలను యాజమాన్యంతో మాట్లాడి తిరిగి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు ఆర్ఎన్. సంతోష్, సుభాశ్, భానుగౌడ్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థుల ప్రయోగాలు భేష్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ప్రయోగాలు చేయడం హర్షించదగ్గ విషయమని చిలప్‌చెడ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్‌లను పరిశీలించి, ప్రయోగాలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మేరీకృప, ఉపాధ్యాయులు మహేశ్‌కుమార్, సునీల్ పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మ బోనాలు



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలు ఊరేగించారు. గ్రామశివారులోని ఎల్లమ్మ ఆలయానికి గౌడ సంఘం సభ్యులు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

◆ 'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అపే శక్తి ప్రభుత్వానికి లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. సమస్యల సాధన కోసం చలో హైదరాబాదు వెళ్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడంపై తీవ్రంగా ఖండించారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలలోను మెరుగైన భోధన

చిన్నశంకరంపేట(మెదక్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన చేస్తూ వార్షికోత్సవ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ పుష్పవేణి అన్నారు. మంగళవారం మండలంలోని అగ్రహారం ప్రాథమిక పాఠవాల వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోచయ్య, మహేశ్వర్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గోన్నారు.

◆ వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేణుకామాత–జమదగ్ని మహర్షి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు రామాగౌడ్, సిద్ధాగౌడ్, స్వామిగౌడ్, మల్లేశంగౌడ్, యాదాగౌడ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా మల్లన్న వార్షికోత్సవాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ, తుపాకులపల్లి, వెంకటాపూర్ అగ్రహారం గ్రామాల్లో మల్లన్న ఆలయ వార్షికోత్సవాలను గ్రామస్తులు మంగళవారం నిర్వహించారు. మల్లన్న ఆలయం వద్ద ఒగ్గుకథలు,నిర్వహించారు.

◆ అంగన్‌వాడీల ముందస్తు అరెస్ట్

నిజాంపేట(మెదక్): తమ వేతనాలు పెంచాలని డిమాండ్‌తో చలో హైదరాబాద్‌కు వెళ్తున్నారనే సమాచారంతో నిజాంపేట పోలీసులు మంగళవారం అంగన్‌వాడీ టీచర్లను కస్టడీలోకి తీసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను ఎంతమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమ వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు సాయంత్రం వారిని విడుదల చేశారు

◆ ఇంటర్నెట్ షాపులో చోరీ

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో ఉన్న ఇంటర్నెట్ షాపుతో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు దుకాణం కిటికీ ధ్వంసం చేసి, రెండు కంప్యూటర్లతో పాటు ప్రింటర్, మానిటర్లు, బయోమెట్రిక్ మిషన్, ల్యామినేషన్ మిషన్, సీసీ కెమెరాలు, లాప్‌టాప్, రూ. 24 వేలు నగదు అపహరించుకుపోయారు. దుకాణం యజమాని సతీశ్ ఫిర్యాదుతో ఎస్‌ఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో చోరీ..

రామాయంపేటలోని వెంకటేశ్వర జనరల్ స్టోర్‌లో సోమవారం రాత్రి దొంగలు పడి రూ. లక్షన్నర నగదు, సీసీ కెమెరాను ఎత్తుకెళ్లారు. ఉదయం స్టోర్ యజమాని దుకాణానికి వెళ్లగా, పైన రేకు తొలగించబడి ఉంది. గల్లా పెట్టెలోని డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆనవాలు దొరక్కుండా దుండగులు సీసీ కెమెరాను సైతం అపహరించుకపోయారు. ఈ విషయమై దుకాణం యజమాని వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

◆ నేడు నీటి సరఫరాలో అంతరాయం

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా బుధవారం నీటి సరఫరా ఉండదని మున్సిపల్ వాటర్ విభాగం ఇన్‌స్పెక్టర్ వినీత్ చెప్పారు. మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీ పడినందున మరమ్మతులు చేయాల్సి ఉందని తెలిపారు. కాగా నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాలకు నీటి సరఫరా ఉండదని భగీరథ అధికారులు వివరించారు.